## ప్రజలు ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలు వినియోగించుకోండి



**సంగం డిసెంబర్ 19 ప్రభాతవార్త :** జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు దొంగతనాలు నివారణ గురించి పోలీసులు ఆటోలలో మైకుల ద్వారా ప్రజలకు తెలియ చేస్తు మండలం మొత్తం ప్రచారం చేస్తున్నారు.క్రిస్మస్ సంక్రాంతి సెలవులు నేపద్యంలో సుదూర ప్రాంతాలకు ,విహార యాత్రలకు ,తీర్ధ యాత్రలకు వెళ్ళేవారి ఎల్‌హెచ్‌ఎంఎస్ ( లాక్‌డ్ హౌస్ మోనిటరింగ్ సిస్టమ్) సేవలను వినియోగించుకోవాలని సంగం సిఐ వేమారెడ్డి,ఎస్ఐ రాజేష్ నేతృత్వంలో ఆటోలలో ప్రచారం చేస్తున్నారు. ఉరేళ్ళ ప్రజలు పోలీసులకు పూర్తి వివరాలతో సమాచారం ఇవ్వాలని వారు కోరారు. గ్రామాలలో కొత్త వ్యక్తులు అనుమానస్పదంగా తిరుగుతుంటే సమాచారం ఇవ్వాలని సూచించారు.

## ఎస్‌ఐ జమాల్‌వలిని సత్కరించిన హ్యాపీసేవాసంస్థ



**కావలిరూరల్, డిసెంబర్19 ప్రభాతవార్త :** హ్యాపీసేవాసంస్థ ఆధ్వర్యంలో కావలి ఒన్‌టౌన్ ఎస్‌ఐ జమాల్‌వలి పుట్టినరోజు సందర్భంగా గురువారం ఒకటవపట్టణ పోలీసుస్టేషన్‌నందు ఆయనను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియచేయడం జరిగింది. ఈ సందర్భంగా హ్యాపీసేవాసంస్థ గౌరవ అద్యక్షులు యస్‌కె ఖాదర్‌బాషా మాట్లాడారు. మంచి సేవాతత్పరులు ఎస్‌ఐ జమాల్‌వలి అని హ్యాపీసేవాసంస్థ ద్వారా ప్రతి సంవత్సరం వారి సతీమణి పేరుమీద నిరుపేదలకు వస్త్రదానం చేయడం ఎంతో అభినందనీయమని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో హ్యాపీసేవాసంస్థ అద్యక్షులు సయ్యద్ ఘనీబాషా, లోక్‌అదాలత్ సభ్యులు ఎం.మాలకొండారెడ్డి, హ్యాపీసేవాసంస్థ ఉపాద్యక్షులు దేవరకొండ విజయ్, జాగర్లపూడి సాయిశివ, తదితరులు పాల్గొని ఆయన సేవలను కొనియాడారు.

## అష్ఫాఖుల్లా ఖాన్, రామ్ ప్రసాద్ బిస్మిల్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి



**ఉదయగిరి, డిసెంబర్ 19, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి రేడియన్స్ స్కూల్లో ఆఫ్ఫాఖుల్లా ఖాన్ రాంప్రసాద్ బిస్మిన్ 97వ వర్ధంతి సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలు రామ్ ప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖుల్లా ఖాన్‌లను ఆదర్శంగా తీసుకుని మత సామరస్యాన్ని చాటాలని, గురువారం ఉదయగిరి రేడియన్స్ స్కూల్ నందు జరిగింది. స్వాతంత్ర్య సమరయోధులు, అమరవీరులు రామ్ ప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖుల్లా ఖాన్‌ల 97వ వర్ధంతి, జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమర వీరుల చిత్రపటాలకు పూలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామంలో ఉరి కంభం ముద్దాడిని తొలి భారతీయుడు, తొలి ముస్లిం అష్ఫాఖుల్లా ఖాన్ అన్నారు. 1900 సంవత్సరం అక్టోబర్ 20న ఉత్తరప్రదేశ్‌లోని షాజహాన్ పూర్‌లో అష్ఫాఖుల్లా ఖాన్ జన్మించారని అన్నారు. చిన్నతనం నుండే బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధడన్నారు. అష్ఫాఖుల్లా ఖాన్, రామ్ ప్రసాద్ బిస్మిల్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాన్నారు. ఈ కార్యక్రమంలో అవాజ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రేడియన్స్ స్కూల్ హెడ్ మాస్టర్ మసూద్ అవాజ్, కమిటీ సభ్యులు నజర్ భాష,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కోటాయిపల్లిలో రెవెన్యూ సదస్సు



**ఉదయగిరి, డిసెంబర్19, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులకు మంచి స్పందన వస్తున్నట్లు తహశీల్దార్ సుభద్ర తెలిపారు. గురువారం కోటాయిపల్లిలో రెవెన్యూ సదస్సులను అధికా రులు నిర్వహించారు. అర్జీలను స్వీకరిం చారు. ఈ రెవెన్యూ సదస్సులో ఆరు అర్జీలు మాత్రమే వచ్చాయని అవి భూ సమస్యలకు సంబంధించినవని అర్జీలను వెంటనే పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, రైతులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో సమావేశం



**ఉదయగిరి, డిసెంబర్ 19, ప్రభాతవార్త :** వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు రావాలంటే కష్టపడి చదవాల్సి ఒదేనని ఉదయగిరి ఎంఈఓ -2 తోట శ్రీనివాసులు తెలిపారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తెల్లవారు జామున లేచి ఆయా సబ్జెక్టులను అభ్యసన చేసి కంఠస్థం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బాల కేశవులు ఉన్నారు.

## మినీ గోకులాలు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలి



**ఉదయగిరి, డిసెంబర్ 19, ప్రభాతవార్త :** మండలంలో నిర్మాణంలో ఉన్న మినీ గోకులాలు నిర్ధేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఎంపీడీఓ అప్పాజీ తెలిపారు. గురువారం పట్టణంలోని స్త్రీ శక్తి భవన్‌లో మండల ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 31 లోగా గోకులాల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. హార్టికల్చర్ సంబంధించి రైతులు ఈనెల 25లోగా సూచించిన మొక్కలను నాటాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాసులు ఉన్నారు.

## డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై హోంమంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలను ఖండించండి



**ఉలవపాడు, డిసెంబర్ 19, ప్రభాతవార్త :** భారత పార్లమెంటులో రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు నిండిన సందర్భంగా జరిగిన చర్చలు ముగింపు సందర్భంగా భారత హోంమంత్రి అమిత్‌షా రాజ్యసభలో మాట్లాడుతూ పదే పదే అంబేద్కర్ పేరు చెప్పుకోవడం ఫ్యాషన్ అయిపోయింది. అన్ని సార్లు దేవుడు పేరు స్మరించి ఉంటే వారికి ఏడు జన్మలకు స్వర్గంలో స్థానం దక్కదని అత్యంత దుర్మార్గంగా కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్‌ను నిర్లక్ష్యం చేసిందని పేరుతో అంబేద్కర్‌ను అవమానించారు. అందువలన అమిత్‌షా భారత పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయాలని, హోం మంత్రి పదవి నుండి తొలగించాలని హోం మంత్రిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి యాక్ట్ కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య డిమాండ్ చేస్తుందన్నారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయు రాష్ట్ర కార్యదర్శి ఆర్.మోహన్ మాట్లాడుతూ 1949 నవంబర్ 26న భారత రాజ్యాంగం రాజ్యాంగ సభచే ఆమోదించబడింది. 1949 నవంబర్ 30వ తేదీన ఆర్ఎస్ఎస్ పత్రిక ఆర్గనైజర్‌లోభారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా వేల సంవత్సరాలుగా భారతీయ సమాజాన్ని దిశా నిర్ధేశం చేస్తున్న మనుస్మృతి ఉండగా భారత దేశానికి మరో రాజ్యాంగం అవసరం లేదని, వేదాలు తరువాత ఆరాధని య్య గ్రంధం మనుస్మృతి మన సంస్కృతి, సంప్రదాయాలు ఆచారాలు, వ్యవహారాలు, అలవాట్లు ఆలోచనలకు మనుస్మృతి ఆధారమని మనుస్మృతి ఆధారంగానే దేశం నడుచుకోవాలంటూ రాశారని అన్నారు. అంబేద్కర్‌ను అవమానకరంగా మాట్లాడుతున్నారని అందువలన దళిత, ప్రజా స్వామ్య, విప్లవశక్తులు ఏకమై సమైక్యంగా హిందూ ఫాస్టిస్ట్ శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అభి ఏక్‌ఫ్యాషన్ హూ గయా హై అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్ ఇత్నా నామ్ అగార్, భగవాన్ కాలేతో సౌత్ ఇన్మోన్ తక్ స్వర్గ మిల్ జాతా(అంబేద్కర్ అంబేద్కర్ అని చెప్పుకోవడం ఫ్యాషన్ అయిపోయింది. ఎన్ని సార్లు దేవుడి పేరు స్మరించి ఉంటే వారికి ఏడు జన్మలకు స్వర్గంలో స్థానం దక్కేది.

## కోవూరులో దోమల నివారణకు ఫాగింగ్



**కందుకూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త :** మండలంలోని కోవూరు గ్రామంలో దోమల నివారణకు గురువారం ఫాగింగ్ కార్యక్రమం చేపట్టారు. సర్పంచ్ ఆవుల మాధవరావు ఆధ్వర్యంలో గ్రామంలో ప్రజల ఆరోగ్య దృష్ట్యా దోమల వల్ల సీజనల్ వ్యాధులు, విష జ్వరాలు, అంటు వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండుట కోసం గ్రామంలో అన్ని బజార్లలో ఫాగింగ్ చేయించారు. ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల త్యాగాలను యువత ఆదర్శంగా తీసుకోవాలి




**నెల్లూరు,డిసెంబరు19 ప్రభాతవార్త-విద్య :** దేశంకోసం బ్రిటీష్‌వారి చేతుల్లో ప్రాణాలు అర్పించిన పండిత్ రామ్‌ప్రసాద్ బిస్మిల్,అష్ఫాఖుల్లా ఖాన్‌ల త్యాగాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆవాజ్ జిల్లా కార్యదర్శి రషీద్ పేర్కొన్నారు. పండిత్ రామ్‌ప్రసాద్ బిస్మిల్,అష్ఫాఖుల్లా ఖాన్‌ల 97వ సంస్మరణ సభను గురువారం నగరంలోని స్దానిక రామచంద్రారెడ్డి భవన్‌లో జిల్లా అవాజ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు 1927 డిసెంబరు 19న కకోరి రైలు సంఘటనలో భాగంగా విప్లవోద్యమనేతలను బ్రిటీషువారు ఉరితీశారన్నారు. హిందూ ముస్లింల ఐక్యతకు వారు చేసిన కృషి అబినందనీయమన్నారు. తోలుత పండిత్ రామ్‌ప్రసాద్ బిస్మిల్,అష్ఫాఖుల్లా ఖాన్‌ల చిత్రపతాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో నాయకులు కత్తి శ్రీనివాసులు, నరసింహం, వెంకటరమణ, హర్ష, రియాజ్, సయ్యద్,అన్సర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉదయగిరి సర్కిల్ పరిధిలో అధిక ధరలకు మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవు



**ఉదయగిరి, డిసెంబర్ 19, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సర్కిల్ పరిధిలో అధిక ధరలకు మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని సీఐ టి.లక్ష్మణ్ స్వామి హెచ్చరించారు. ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో 12 మద్యం షాపులు ఉన్నాయని చెప్పారు. అక్టోబర్ నుండి ఇప్పటి వరకు 27 కేసులు నమోదు చేశామన్నారు. 596 మద్యం సీసాలు, 3 టూ వీలర్స్, 107.28 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు.

## కెనరా బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం



**లింగసముద్రం, డిసెంబర్ 19, ప్రభాతవార్త :** కెనరా బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పెట్టుకొని పని చేయడం జరుగుతుందని కెనరా బ్యాంకు తిరుపతి సర్కిల్ ఆఫీస్ జనరల్ మేనేజర్ ఐ.పాండురంగ మితంతయ్య చెప్పారు. గురువారం మండల కేంద్రమైన లింగసముద్రంలోని కోటయ్య సమాధి సెంటర్లో మట్టే వారి కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన నూతన కెనరా బ్యాంకు భవనాన్ని ఆయన ప్రారంబించారు. మేళతాళాలతో, పూర్ణకుంభంతో సీనియర్ మేనేజర్ శేషగిరి ఆధ్వర్యంలో బ్యాంకు సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. నూతన భవనంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గతంలో విజయలక్ష్మి థియేటర్ సమీపంలో ఉన్న కెనరా బ్యాంకును ఇక్కడికి మార్చడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ప్రజలకు కెనరా బ్యాంకు మంచి సేవలందించి వారి మన్ననలు పొందుతుందన్నారు. మండలంలో మూడు గ్రామాల్లో కెనరా బ్యాంకు సేవలు ప్రజలకు అందించడం జరుగుతుందన్నారు. ఖాతాదారులందరూ బ్యాంకును ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రీజనల్ ఆఫీస్ ఏజీఎం అదారి నాగరాజు, బ్యాంకు సీనియర్ మేనేజర్ సీహెచ్ శేషగిరి, మొగిలిచర్ల కెనరా బ్యాంకు మేనేజర్ ఆర్‌వీకే ప్రసాద్, తిమ్మారెడ్డిపాలెం కెనరా బ్యాంకు మేనేజర్ జి.అవినాష్, బ్యాంకు సిబ్బంది శ్రీకాంత్, పార్వతి, శశాంక్, మహేంద్ర, వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, ఏపీఎం సింహ్వాద్రిరావు, వెలుగు సీసీలు, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉదయగిరి టెలికం అడ్వైజరి కమిటీ డైరక్టర్‌గా తాటికొండ అనూష



**లింగసముద్రం, డిసెంబర్ 19, ప్రభాతవార్త :** మండల తెలుగు యువత నాయకులు తోపూరి రమేష్ సతీమణి తాటికొండ అనూషను టెలికం అడ్వైజరీ కమిటీ డైరక్టర్‌గా ఉదయగిరి నియోజకవర్గం నుండి నియమించారు. ఈ సందర్భంగా రమేష్ అనూష దంపతులు ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్‌ని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై నమ్మకాన్ని ఉంచి తనను డైరక్టర్‌గా నియ మించేలా సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కాకర్ల సురేష్‌ను కలిసిన సందర్భంలో అనూషకు శాలువా కప్పి సత్కరించారు. అనూషకు పలువురు అభినందనలు తెలిపారు.

## దొడ్ల సుబ్బారావు కుమారుడు వివాహ వేడుకల్లో మాజీ మంత్రి కాకాని



**ముత్తుకూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త :** కృష్ణపట్నం పంచాయితీలోని గొల్ల వీధికి చెందిన వైసిపి నాయకులు దొడ్ల సుబ్బారావు కుమారుడు వివాహ వేడుకలకు మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి పాల్గొని ఆశీర్వదించారు. అనంతరం పంచాయితీలోని వైసిపి నాయకులతో ఆత్మీయంగా మాట్లాడారు. ఆయన వెంట వైసిపి మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ జడ్పిటిసి నెల్లూరు శివప్రసాద్, ఉపసర్పంచ్‌రాగాల వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు రాగాల కోదండ, కందస్వామి, రాగాల శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

## వి ఎస్ యూ లో స్టూడెంట్స్ హ్యాండ్ బుక్ ఆవిష్కరణ



**వెంకటాచలం,డిసెంబర్ 19,ప్రభాతవార్త:** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, విశ్వవిద్యాలయ విద్యార్థులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని కలగలిపిన పుస్తకాన్ని విశ్వవిద్యాలయ మొట్టమొదటి సారిగావిశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎస్. విజయభాస్కర రావు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఉపకులపతి గారు మాట్లాడుతూ: "ఈ పుస్తకం విద్యార్థులకి మంచి మార్గదర్శకంగా ఉంటుంది. విశ్వవిద్యాలయంలో అందుబాటులో ఉన్న అన్ని విద్యా కార్యక్రమాలు, వనరులు, సదుపాయాలు, మరియు అవకాశాలను ఒకేచోట పొందుపరచడం ద్వారా విద్యార్థులు తమ విద్యా ప్రమాణాన్ని మరింత విజయవంతంగా ఆవిష్కరించగలరు. ఇది నూతన తరం విద్యార్థులకి ప్రేరణగా నిలుస్తుంది" అని పేర్కొన్నారు.అలాగే, ఆయన ఈ పుస్తకం రూపకల్పనలో భాగమైన టీమ్‌ను అభినందించి, భవిష్యత్తులో మరింత ఉపయోగకరమైన సమాచార సదుపాయాలను అందించేందుకు విశ్వవిద్యాలయం కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ కె సునీత,కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్.విజయ,పరిక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఆర్.మధుమతి, డాక్టర్ ఉదయ శంకర్, డాక్టర్ కోట నీల మణికంఠ, డాక్టర్ పి.గోపి కృష్ణ, డాక్టర్ పి. శ్రీనివాస్, డాక్టర్ పి.త్రివేణి, కె వి ఎల్ శ్రీ కన్య రావు మరియు విద్యార్థులు,పాల్గొన్నారు.

## సూక్ష్మనీటి సేద్యంపై అవగాహన పెంచండి



**వలేటివారిపాలెం డిశంబరు 19, ప్రభాతవార్త :** సూ క్ష్మనీటి సేద్యంపై అవగాహన పెంచుకోవాలని మైక్రో ఇరిగేషన్ ప్రాజక్టు డైరక్టర్ బి. శ్రీనివాసులు అన్నారు. గురువారం స్దానిక రైతు కేంద్రంలోసూ క్ష్మనీటి సేద్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్దానిక వ్యవసాయాధికారి హేమంత్ భరత్ కుమార్ అధ్య క్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొ ని రైతులకు పలు సలహాలు సూచనలు చేశారు. ప్రభుత్వ డ్రిప్‌లు, స్ప్రింకర్లు,పైపులు రాయితీపై అంది స్తున్నట్లు తెలిపారు.రాయితీ వివరాలను తెలిపారు.ఆసక్తి అర్హత గల రైతులు పూర్తి వివరాలకు వ్యవసా యశాఖ సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో మైక్రో ఇరిగేషన్ ప్రాజక్టు ప్రతినిధులు నరేష్, మహేంద్ర, శ్రీహరి తదితరులుతోపాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## కొత్తపేట గ్రామంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు



**గుడ్లూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త :** గుడ్లూరు మండలం లోని కొత్తపేట గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ పి.మారుతీ రావు పరీక్షించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. గ్రామాల్లో సర్వే చేసి జ్వరం ఉన్న వారిని గుర్తించారు. గ్రామంరలో ఉన్న వీధుల్లో పంచాయతీ కార్యదర్శి మార్టిన్ ఆధ్వర్యంలో బ్లీచింగ్ ఫౌండర్ చల్లించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మారుతీరావు మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించడంజరిగిందన్నారు. ఈ మెడికల్ క్యాంపును ఎంపీడీఓ వెంకటేశ్వర్లు సందర్శించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ భాస్కరరావు, ఏఎన్ఎం విజయలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ ప్రీతి, హెల్త్ అసిస్టెంట్ మల్లిఖార్జున్, సెక్రటరీ మార్టిన్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## వానొచ్చేసిందే.... వరదొచ్చేసిందే....
## చలవేస్తోందమ్మో..... చంపేస్తోందమ్మో...















ఫోటోలు : నంద మాల్యాద్రి

## క్రిస్మస్ సందర్బంగా జనసేన వీరమహిళల సేవా కార్యక్రమాలు



**నెల్లూరు,డిసెంబరు19 ప్రభాతవార్త-విద్య :** క్రిస్మస్ పర్వదిన్నాని పురస్కరించుకుని జనసేన పార్టీ వీరమహిళ గజరాజు శాంతి కల ఆధ్వర్యంలో గురువారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో బాగంగా పేదలను అన్నదాన, వస్త్రదాన కార్యక్రమాలను చేపట్టారు. ఈ సేవా కార్యక్రమాల్లో ముఖ్యఅతిధిగా జనసేన పార్టీ కోర్ కమిటీ సభ్యులు, జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ పాల్గొని అన్నదాన,వస్త్రదాన కార్యక్రమాలను ప్రారంభించారు.ఈ సందర్బంగా గునుకుల మాట్లాడుతు వైకాపా అధికారంలో ఉన్న సమయంలో కార్పోరేషన్ ఎన్నికలు నిర్వహిస్తున్న తరుణంలో ఎటువంటి భయం లేకుండా 51వ డివిజన్ నుండి జనసేన నాయకుడిగా ఉన్న కీర్తిశేషులు వరకుమార్ ఆయన సతీమణి శాంతికల ను సొంత ఖర్చులతో పోటీ చేయించి ప్రచారం చేయించారన్నారు. అంతి ధైర్యశాల వరకుమార్ నేడు మన మధ్య లేకపోవటం విచారకరమన్నారు. నేడు శాంతి కల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేయటం సంతోషంగా ఉందన్నారు. అలాగే స్దానిక ప్రజల సమస్యలను తెలుసుకుని మంత్రి నారాయణ దృష్టికి , రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి తెలియజేసి సాధనకు పాటుపడతామన్నారు. ఈ కార్యక్రమంలో నాగర్నతం యాదవ్ ,ఆషిక్, తదితరులు పాల్గొన్నారు.

## విస్తారంగా పడుతున్న వరినాట్లు



**కోవూరు, డిసెంబరు 19ప్రభాతవార్త :** కోవూరు సర్కిల్ పరిధిలోని అన్ని మండలాల్లో ప్రస్తుత సీజన్‌లో వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. ప్రస్తుతం ప్రకృతి కూడా అనుకూలించడంతో రైతులు వరినాట్లు ముమ్మరంగా చేపడుతున్నారు. ప్రస్తుతం కోవూరు వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో 62 వేల ఎకరాలకు గానూ ప్రస్తుతం 35,112 ఎకరాలు వరినాట్లు పూర్తికావడం జరిగిందని, సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత తెలిపారు. ప్రస్తుతం వరినాట్లు వేసే రైతులు సంబంధిత మండల వ్యవసాయ శాఖ సలహాలు, సూచనలను తప్పక తీసుకుని ఎరువులు, పురుగుమందులు వాడుకోవాలని ఈసందర్బంగా ఆమె సూచించారు.

## రైతులకు అందుబాటులో ఎరువులు ఉండాలి



**కోవూరు, డిసెంబరు 19ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని పలు ఎరువుల దుకాణాలను విడవలూరు మండల వ్యవసాయాధికారి పి. కృష్ణయ్య ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్బంగా ఆయన ఇనమడుగు, చెర్లోపాలెం, కోవూరులోని పలు ఎరువుల దుకాణాలను నిశితంగా పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి షాప్‌లో నోటీసు బోర్డులో ఎరువులుకు సంబంధించిన స్టాక్ వివరాలను తప్పక నమోదు చేయాలన్నారు. అదేవిధంగా నోటీస్‌బోర్డులో ఎరువుల ధరలు కూడా తప్పక ఉండాలన్నారు. ఎరువులు అమ్మే విషయంలో వారికి సంబంధించిన వేలిముద్రలను ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేసేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఎరువులను ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే అమ్మాలని ఎక్కడైనా ఎరువుల అమ్మకాలను ఎంఆర్‌పీ ధరల కంటే ఎక్కువ అమ్మితే అటువంటి దుకాణాల పై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మండల వ్యవసాయాధికారిణి ఇందిరావతి ఉన్నారు.

## డిఇఒ ఆకస్మిక తనిఖీ



**వింజమూరు,డిసెంబర్19,ప్రభాతవార్త:** వింజమూరులోని బాలుర ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి బాలాజీరావ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని పాల్ ల్యాబ్‌ను పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థుల పాఠ్య ప్రణాళికను, విద్యార్థుల విద్యాభివృద్ధి గురించి సమీక్షించారు. 7,9తరగతుల విద్యార్థులకు జరుగుతున్న ఎస్ఎ-1 పరిక్షలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగబోయే 10వ తరగతి పరిక్షలకు విద్యార్థులను సంక్షిప్తం చేయాలని, ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా కృషి చేయాలన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న నూరురోజుల ప్రణాళికను అమలు చేస్తూ వెనుకబడిన విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పబ్లిక్ పరిక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. మార్చి 17నుండి పబ్లిక్ పరిక్షలు ప్రారంభం కానున్నాయని అందుకు తగిన విధంగా సంసిద్ధులను చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎంఇఒ మధుసూధన్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.మాల్యాద్రి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులతో భూసమస్యలు పరిష్కారం




**వింజమూరు,డిసెంబర్19,ప్రభాతవార్త:** రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులతో గ్రామాల్లో నెలకొన్న రెవెన్యూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తహసిల్దార్ హమీద్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని తమిదపాడులో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో 33అర్జీలు భూ సమస్యలపై అందాయన్నారు. ఈ అర్జీలు ఎక్కువగా రీసర్వే, సాగుభూములకు పట్టాలు మంజూరు చేయాలని వచ్చాయన్నారు. ఈకార్యక్రమంలో ఆర్ఐ ఇమ్రాన్‌ఖాన్, విఆర్ఒ రమణయ్య, సర్వేయర్ రవి, శశి, కంప్యూటర్ ఆపరేటర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌ను అవమానించినవారు జాతికి క్షమాపణ చెప్పాలి

### దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు యస్ మల్లి




**కావలి, డిసెంబర్19 ప్రభాతవార్త :** పార్లమెంట్‌లో అంబేద్కర్‌ను అవమానించినవారు జాతికి క్షమాపణ చెప్పాలని దళిత సంఘర్షణ సమితి జిల్లాఅధ్యక్షుడు యస్.మల్లి డిమాండ్ చేశారు. దళితసంఘర్షణ సమితి ఆధ్వర్యంలో కావలిపట్టణ బ్రిడ్జి సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహంవద్ద గురువారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రెండురోజుల క్రితం పార్లమెంట్‌లో చర్చజరిగినపుడు కేంద్రహోమ్‌శాఖామంత్రి అమిత్‌షా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురించి అవమానకరంగా మాట్లాడారని తెలిపారు. కాంగ్రెస్‌పార్టీ ప్రతిరోజూ అంబేద్కర్‌ను భుజానవేసుకుని తిరుగుతుంటారని, అంబేద్కర్ ఒకరు వీరికి దొరికారని అమిత్‌షా కాంగ్రెస్‌పార్టీని ఉద్దేశించి మాట్లాడుతూ అవమానించారన్నారు. పాలకపార్టీ, ప్రతిపక్షపార్టీలు అంబేద్కర్ చిత్రపటాలను పట్టుకుని ఒకరినొకరు దూషించుకుంటున్నారన్నారు. వారు వ్యక్తిగతంగా దూషించుకోవచ్చుకానీ, అంబేద్కర్‌ను మధ్యనపెట్టి దూషిస్తున్నారని, ఇది భారతజాతికి అవమానమని అన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగంవలన 141 కోట్లమంది ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారని తెలిపారు. అది అంబేద్కర్ కల్పించిన హక్కులద్వారానే సాధ్యమైందని అటువంటి మహనుభావుడిని పట్టుకుని అవమానించడం దుర్మార్గమన్నారు. దూషించిన మొదటిస్థానంలో ఉన్న అమిత్‌షా జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్‌చేశారు. ఇలాగే మరొకసారి జరిగితే అధికారపార్టీకి బుద్ధిచెబుతామని హెచ్చరికలు చేశారు. ఈ కార్యక్రమంలో అలూరు బ్రహ్మయ్య, ఎమ్మార్పీయస్ నాయకులు జరుగుమల్లి విజయరత్నం, రమేష్, జనార్ధన్, జి.తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనులను కల్పించడం లో అలసత్వం తగదు



**వరికుంటపాడు,డిసెంబర్ 19,ప్రభాతవార్త :** ఉపాధి హామి పథకం లో కూలీలకు పనులు కల్పించడం లో అలసత్వం తగదని ఎపిఒ అజంఖాన్ అన్నారు.స్థానిక స్త్రీ శక్తి భవనంలో ఉపాధి హామి సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూలీలకు కూలీ గిట్టుబాటు అయ్యేలా కొలతల ప్రకారం పనులు కల్పించాలన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికి పనులు కల్పించాలన్నారు.రికార్డులను ఎప్పటికప్పుడు పూర్తి చేసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ల కు సూచించారు.ఈ కార్యక్రమములో ఉపాధి హామి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్‌సరఫరా నిలిపివేయడంతో ఇబ్బందులుపడ్డ ప్రజలు

**దగదర్తి, డిసెంబర్19 ప్రభాతవార్త :** దగదర్తి గ్రామంలోని పోలేరమ్మగుడివద్ద 11కెవి పోల్‌ను మారుస్తుండడంతో గురువారం ఉదయం 10 గంటలనుంచి సాయంత్రం 5.30 గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో ప్రజలు విద్యుత్ సరఫరా లేక ఇబ్బందులు పడ్డారు.

## జాతీయ సమైక్య శిబిరానికి శ్రీచైతన్య డిగ్రీ కళాశాల విద్యార్ధిని ఎంపిక



**కావలిరూరల్, డిసెంబర్19 ప్రభాతవార్త :** కావలి శ్రీచైతన్య డిగ్రీ కళాశాలలో చదువుతున్న కెవి సుశ్రిత యన్‌యస్‌యస్ జాతీయ సమైక్య శిబిరానికి ఎంపిక కావడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం సుశ్రితకు పూలబొకేను అందచేసి అభినందనలు తెలియచేసి హర్షం వ్యక్తంచేయడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల డైరక్టర్ పి.జానకిరామ్ మాట్లాడారు. గత 7సంవత్సరాలుగా యన్‌యస్‌యస్ ద్వారా ఎన్నో సేవాకార్యక్రమాల్లో పాల్గొంటూ దాని ప్రభావంతో మా కళాశాల విద్యార్ధిని యూనివర్సిటిస్థాయిలో ఎంపికైన 8 మందిలో ఒకరుగా ఎంపిక కావడం గర్వకారణమని తెలియచేశారు. ఈ నెల 21వ తేదీ నుండి 27వ తేదీవరకు మధ్యప్రదేశ్ గ్వాలియర్‌లోని లక్ష్మీబాయ్ నేషనల్ ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో జరుగు యన్‌యస్‌యస్ జాతీయ సమైక్య శిబిరంలో పాల్గొనడం జరుగుతుందని తెలియచేశారు. కళాశాల ప్రిన్సిపాల్ పివి రావు మాట్లాడారు. మా కళాశాల విద్యార్థులకు మానసిక ఒత్తిడికి గురికాకుండా సామాజిక సేవతోపాటు మానసికంగా ధృఢంగా మార్చడానికి స్పోర్ట్స్‌లో కూడా ప్రోత్సాహాన్నిస్తున్నామని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవికాంత్, యన్‌యస్‌యస్ ప్రోగ్రాం ఆఫీసర్ పివి సాయితేజ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## సంయుక్త సంరక్షణలోఉన్న పిల్లలకు బియ్యం, నిత్యావసరవస్తువుల వితరణ



**కావలిరూరల్, డిసెంబర్19 ప్రభాతవార్త :** కావలి కచ్చేరిమిట్ట నివాసులు లంకపల్లి శ్రీనివాసరావు తండ్రి లంకపల్లి నరసింహారావు పదవ వర్ధంతి సందర్భంగా సంయుక్త సేవాసంస్థ కార్యాలయంలో సంరక్షణలో ఉన్న పిల్లలకు నిత్యావసర వస్తువులు, బియ్యం వితరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా దాత లంకపల్లి శ్రీనివాసరావు మాట్లాడారు. సంయుక్త సేవాసంస్థ సంరక్షణలో ఉన్న పిల్లలకు తన తండ్రి జ్ఞాపకార్థం నిత్యావసరవస్తువులు, బియ్యం వితరణ చేయడం సంతోషంగా ఉందని తెలియచేశారు. పిల్లలందరూ శ్రద్ధగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తెలియచేశారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గంగపట్నం సురేంద్ర మాట్లాడారు. తమయొక్క సంస్థ సంరక్షణలో ఉన్న పిల్లలకు నిత్యావసర వస్తువులు, బియ్యం వితరణ చేసిన దాత లంకపల్లి శ్రీనివాసరావుకు, వారి కుటుంబసభ్యులకు ధన్యవాదాలు తెలియచేశారు. లంకపల్లి నరసింహారావు ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. అనంతరం దాత శ్రీనివాసరావుకు చిరుసత్కారం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్వర్గీయ లంపల్లి నరసింహారావు మనువరాళ్లు లంకపల్లి హన్సిని, అమృత, వైష్ణవి, మనువళ్ల లంకపల్లి నీహాల్‌రావు, ధనుష్, దీపక్, హర్షిత్‌లు పాల్గొన్నారు.

## తిమ్మసముద్రం గ్రామంలో అక్రమమద్యంపై దాడులు



**కావలి, డిసెంబర్19 ప్రభాతవార్త :** కావలి డివిజన్‌లోని జలదంకి మండలం తిమ్మసముద్రం గ్రామంలో చట్టవిరుద్ధంగా మద్యం విక్రయాలు చేస్తున్నవారిపై కావలి ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఎస్ఐ దేవిక, పోలీసులు గురువారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మాణిక్యమ్మవద్ద లభించిన 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ఆమెను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ దేవిక తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## జాతీయ సమైక్యత శిభిరానికి పాల్గొన్న వి.ఎస్.యూ విద్యార్థులు ఎంపిక




**వెంకటాచలం,డిసెంబర్ 19, ప్రభాతవార్త:** మధ్యప్రదేశ్ రాష్ట్రంలో గ్వాలియర్ జిల్లాలో లక్ష్మీ బాయి నేషనల్ ఇన్సిట్యూట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషనల్ యూనివర్సిటీలో ఈ నెల 21 నుంచి 27 వరకు నిర్వహించనున్న జాతీయ సమీకృత శిభిరానికి విక్రమ సింహపురి యూనివర్సిటీ కళాశాల మరియు అనుబంధ కళాశాల విద్యార్థులు 8 మంది సెలెక్ట్ అవ్వడం అభినందనియమని వి సి వి.భాస్కరరావ్ తెలిపారు.వివిధ ప్రతిభ పాటవాళ్లను ప్రదర్శించడంతో పాటుగా వ్యక్తిత్వ వికాస అంశాల పైన తర్ఫీదు పొందనున్నారు.ఎన్.ఎస్.ఎస్ ద్వారా యూనివర్సిటీ గుర్తింపు ను జాతీయ స్థాయిలో విద్యార్థులు తమ ప్రతిభ త్వారా ప్రదర్శించబోతున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్స్ కు కావలసిన ఏర్పాట్లను ఎన్.ఎస్.ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్ శంకర్ అల్లం మరియు ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బి.వెంకటసుబ్బారెడ్డి దగ్గరుండి పసర్యవేక్షించి వారిని ఈ రోజు ఆ శిభిరాన్ని సాగనంపడం జరిగింది.

## ఉలవపాళ్ల గ్రామంలో రెవిన్యూ సదస్సు



**దగదర్తి, డిసెంబర్19 ప్రభాతవార్త :** దగదర్తి మండలంలో ఉలవపాళ్ల గ్రామంలో గురువారం రెవిన్యూ సదస్సు జరిగింది. ఈ సదస్సులో తహశీల్దారు పి.కృష్ణ, రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ ఏ.శివకుమార్, సర్వేయర్ యస్.కె.రబియ పాల్గొన్నారు. రైతులవద్ద నుంచి వోషనల్ కాతాను రెగ్యులర్ కాతాలుగా నిర్వహించేందుకు, అడంగల్ విస్తరణ, పాస్‌బుక్‌లు రీప్లేస్‌మెంట్ కొరకు అర్జీలను ఈ సదస్సులో అధికారులు స్వీకరించారు. ఈ సదస్సులో గ్రామసర్పంచ్, వీఆర్ఒ, రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## శివప్రసాద్‌రెడ్డిని సన్మానించిన ముస్లిం నేతలు



**కోవూరు, డిసెంబరు 19ప్రభాతవార్త :** కోవూరు సాగునీటి సంఘం అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన అత్తిపల్లి శివప్రసాద్‌రెడ్డిని కోవూరు ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కలిసి శాలువాతో సత్కరించి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు సయ్యద్ రఫీ, షేక్ రఫీ, ఖాదర్‌భాయ్, ఎండీ నసీర్, షేక్ మహమ్మద్, సమీవుల్లా ఖాన్‌లు ఉన్నారు.

## రైతు సమస్యలపై స్పందిస్తాం - తాసిల్దార్ స్ఫూర్తి రెడ్డి



**విడవలూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త :** మండలం సవాయిపాలెం, గుండాలమ్మ పాలెం,రెవిన్యూ గ్రామ సభ కార్యక్రమం గ్రామ సచివాలయంలో తాసిల్దార్ స్ఫూర్తి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవిన్యూ సదస్సు గ్రామసభలో రైతులు తెలిపిన తప్పిదాలను, రి సర్వే,ఇతర సమస్యలపై వచ్చిన అర్జీలను పూర్తిస్థాయిలో పరిశీలన చేసి రైతులకు శాశ్వత పరిష్కారం చేయడం జరుగుతుంది. రైతులు ఎవరు కూడా అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం రైతుల వద్ద అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, టిడిపి మండల నాయకులు అమరేందర్ రెడ్డి, మండల సర్వేయర్ శ్రీలత, ఆర్ ఐ తదితరులు పాల్గొన్నారు.

## పొలం పిలుస్తుంది కార్యక్రమం



**కొడవలూరు (విడగలూరు),డిసెంబర్ 19, ప్రభాతవార్త :** మండలంలోని నార్త్ రాజుపాలెం,రామన్నపాలెం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ శివన్నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో వరి పొలాలను సందర్శించి వరిలో జింకులోకం ఎక్కువగా ఉన్నదని జింక్ సల్ఫేట్ రెండు గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా వరిలో లింగాకర్షక బుట్టలు, సోలార్ ట్రాప్స్ యొక్క ఆవశ్యకతను గురించి వివరించి సోలార్ ట్రాప్స్ ను వరిలో ఏర్పాటు చేయడం జరిగినది. వరిలో ట్రాప్స్ ఏర్పాటు చేయడం వలన పొలంలో పురుగులను ముందుగానే గుర్తించి అవసరమైన పురుగుమందులు వినియోగించి నిర్మూలన చేసే అవకాశాన్ని పొందవచ్చని తెలియపరిచారు. ట్రాప్స్ ద్వారా పురుగులు ఆకర్షింపబడి అవి పురుగు మందు ద్రావణంలో పడి మరణించే అవకాశం ఉందని తెలియజేశారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రం నెల్లూరు శాస్త్రవేత్త విజయకుమార్ మాట్లాడుతూ వరిలో ఎలుకల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించి ఎలుకల నివారణకు ఉన్నటువంటి వివిధ రకాల పద్ధతులు గురించి వివరించి ఎలుకల మందును పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కోవూరు ఏడిఏ డి.సుజాత మండల వ్యవసాయ అధికారిని సిహెచ్ శ్రీలక్ష్మి, నిహారిక, శివజ్ఞాన, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి




**అనంతసాగరం,డిసెంబర్19,ప్రభాతవార్త:** మండల పరిషత్ కార్యాలయంలో గురువారం రెండవ రోజు శిక్షణా కార్యక్రమాన్ని ఎంపిడిఒ పి.ఐజాక్‌ప్రవీణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఎంపిపి పెయ్యల సంపూర్ణమ్మ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులను వినియోగించుకొని గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది సర్పంచ్‌లతో సమన్వయం చేసుకొని విద్య, ఆరోగ్యం అందరికి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామస్థాయిలో ఈ పనులన్నింటిని సక్రమంగా నిర్వహించుకుంటేనే అభివృద్ధి లక్ష్యాలను సాధించగలమన్నారు. ఎంపిడిఒ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం 2047వ సంవత్సరానికి పేదరిక నిర్మూలన, అందరికీ ఉపాది కల్పన, పరిశుభ్రమైన గ్రామాల ఏర్పాటు, అందరికీ ఆరోగ్యం , ఆర్థికరంగంలో స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి సిబ్బంది, ప్రజా ప్రతినిధులు ఇప్పటి నుండే ప్రణాళికా బద్ధంగా పనిచేయాలన్నారు. ఇఒఆర్‌డి తిరుపతయ్య, ఎపిఎం రమణరావ్, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసరావ్, పవన్, వెల్ఫేర్ అసిస్టెంట్ మురళిలు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## చెంచులక్ష్మీపురం లో ఉచిత వైద్యశిబిరం



**బిట్రగుంట డిసెంబర్ 19 ప్రభాతవార్త:** బోగోలు మేజర్ పంచాయతీ లోని చెంచు లక్ష్మీపురంలో ఆరోగ్య శాఖ వారు గురువారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ, ఆరోగ్య శాఖ తరపున చర్యలు చేపట్టారు. మెడికల్ క్యాంపు నకు వచ్చిన ప్రజల అవసరాలకు మందులు పంపిణీ మరియు అనారోగ్యంతో బాధపడుతున్న వారికి కోవూరుపల్లి వైద్యులు చికిత్స నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ పంచాయతీ కార్యదర్శి షేక్ జహీర్ తో పాటు బోగోలుమాజీ ఎంపిటిసి చిలకపాటి వెంకటేశ్వర్లు,పంచాయతీ మరియు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లాలో యూరియా కొరత లేదు

**– రైతులు ఆందోళన చెందవద్దు**



**కోవూరు, డిసెంబరు 19ప్రభాతవార్త :** జిల్లాలో ప్రస్తుత సీజన్‌లో యూరియా కొరత లేదని, ఈ విషయంలో వ్యవసాయం సాగు చేసే రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయాధికారిణి పి. సత్యవాణి అన్నారు. కోవూరు మండలం పడుగుపాడు రైల్వే స్టేషన్ యార్డ్‌లో గురువారం ఆమె యూరియా లోడింగ్ జరిగే ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఈ డిసెంబర్ నెలలో 25 వేల మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉందన్నారు. ప్రస్తుతానికి 12 వేల మెట్రిక్ టన్నుల యూరియా ఇదివరకే రావడం జరిగిందన్నారు. మిగిలిన 18 వేల టన్నుల యూరియా డిసెంబర్ నెలాఖరులోగా వస్తుందన్నారు. ఈ వారంలో 8 వేల టన్నుల యూరియా వస్తుందని, ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ సీజన్‌లో యూరియా దొరకదని రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని, స్టాక్ పెట్టుకోవడం వంటివి చేయరాదన్నారు. ముఖ్యంగా ప్రస్తుతం వ్యవసాయం సాగు చేసే రైతులు వ్యవసాయ శాఖ సిఫార్సు చేసిన మోతాదులోనే ఎరువులు వాడుకోవాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట జిల్లా వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు నర్సోజీ, కోవూరు సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత, గూడ్స్ సూపర్‌వైజర్ జనార్థన్, ఐపీఎల్ కంపెనీ సేల్స్ మేనేజర్ నారయ్య, తదితరులు ఉన్నారు.

## రెవెన్యూ సదస్సుల్లో అర్జీలకు తప్పక పరిష్కారం చూపుతాం



**కోవూరు, డిసెంబరు 19ప్రభాతవార్త :** రెవెన్యూ సదస్సులో వచ్చే అర్జీలను నిశితంగా పరిశీలించి వాటికి తప్పక పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటామని కోవూరు తహసీల్దార్ నిర్మలానందబాబా తెలిపారు. కోవూరు మండలం పడుగుపాడు సచివాలయంలో గురువారం రెవెన్యూ గ్రామ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని రైతులు రెవెన్యూ పరంగా ఏమైనా సమస్యలు ఉంటే వాటిని పూర్తి సమాచారంతో ఈ సదస్సుల్లో అర్జీలె ఇస్తే వాటిని పరిష్కరించి తగు పరిష్కారం చూపేలా చూస్తామన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఈ రెవెన్యూ సదస్సులను రైతులు పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాకేష్, మండల సర్వేయర్ రమేష్ గౌడ్, గ్రామ రెవెన్యూ అధికారులు, రైతులు ఉన్నారు.

## ఎస్‌ఏ-1 పరీక్షలు ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలి



**కోవూరు, డిసెంబరు 19 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఎస్‌ఏ-1 పరీక్షలను ఒక ప్రణాళికాబద్ధంగా నిర్వహించేలా సంబంధిత పాఠశాల ప్రధా నోపాధ్యా యులు తగు చొరవ తీసుకోవాలని మం డల విద్యాశాఖ అధికారి -2 వై. చెంచులక్ష్మమ్మ అన్నారు. కోవూరు మండలం ఇనమడుగు పంచాయ తీలోని పలు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను గురువారం ఆమె ఆకస్మికంగా పరిశీలి ంచారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేలా ఈ పరీక్షలు రాయాలని ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు ఆమె పలు సూచనలు చేశారు.

## మందుల వాడకంలో నిర్లక్ష్యం తగదు



**కోవూరు, డిసెంబరు 19ప్రభాతవార్త :** దీర్ఘకాలిక వ్యాధులతో మంచంలో ఉండి బాధ పడుతున్న రోగులు మందుల వాడకంలో నిర్ల క్ష్యం చూపకుండా క్రమం తప్పకుండా వాట ిని వేసుకోవాలని లేనిపక్షంలో ఇబ్బందులు తలెత్తే పరిస్థితి వస్తుందని ఇనమడుగు ప్రాథ మిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఇర్ఫాన్ తెలిపారు. కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ పరిధిలోని సచివాలయం-2లో ఎఫ్‌డీపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఈ సీజన్‌లో గర్భ వతులు, బాలింతలు తప్పనిసరిగా మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అదేవిధంగా గ్రామాల్లోని ప్రతి ఒక్కరూ ఆరోగ్య సిబ్బంది అందించే సలహాలు సూచనలను తప్పక తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

## రామ్‌ప్రసాద్ బిస్మిల్, అష్ఫాకుల్లాఖాన్‌లు యువతకు ఆదర్శం కావాలి




**కోవూరు, డిసెంబరు 19 ప్రభాతవార్త :** కాకోరి రైలు సంఘటనలో భాగంగా డిసెంబర్ 19, 1927న విప్లవోద్యమ నేతలు రామ్‌ప్రసాద్ బిస్మిల్, అష్ఫాకుల్లాఖాన్‌లను బ్రిటీష్ ప్రభుత్వం ఉరి తీశారని, అటువంటి వారిని యువత ఆదర్శంగా తీసుకోవాలని నేతలు ఎస్‌కే ఖాజావలి తెలిపారు. కోవూరులోని సీతాపో లయ్య భవనంలో గురువారం వారి చిత్రపటా లకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారిరువురు హిందూ , ముస్లిం ఐక్యతకు ప్రేరణగా, త్యాగానికి ప్రతీకగా నిలిచారన్నారు. వారి స్ఫూర్తితో నేటి యువత కూడా దేశంలో జరిగే రాజకీయ మార్పులను గమనించి లౌకిక రాజకీయాల వైపు నిలవాలన్నారు. లౌకిక రాజ్యాంగానికి వ్యతిరేకంగా ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం చేస్తున్న పరిణామాలు మంచివి కాదన్నారు. బుధవారం పార్లమెంట్‌లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ పట్ల కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు మంచివి కాదన్నారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడుపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఎస్‌కే చాన్‌బాషా, ఎస్‌కే బాబు, సర్దార్ అహ్మద్, వెంకటరమణయ్య, బాషా, సుబ్బారావు, బుజ్జయ్య, పెద్దబ్బయ్య, రమేష్, సురేష్, కార్యకర్తలు ఉన్నారు.

## షార్ట్‌ఫూట్ విభాగంలో మెడల్ సాధించిన శ్రీచైతన్య విద్యార్థి




**కావలిరూరల్, డిసెంబర్19 ప్రభాతవార్త** కేంద్రప్రభుత్వం సహకారంతో నెహ్రూ యువకేంద్రంవారు నిర్వహించిన కావలి డివిజన్‌స్థాయి అథ్లెటిక్స్ షార్ట్‌ఫూట్ విభాగంలో కావలి శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థి యం.నవదీప్ ద్వితీయస్థానం సాధించి మెడల్ కైవసం చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో విద్యార్థి యం.నవదీప్‌ను కళాశాల కరస్పాండెంట్ యస్. వెంకయ్య, డైరెక్టర్లు యం.కొండయ్య, పివియస్ ప్రసాద్, కళాశాల గౌరవ సలహాదారు నందనవనం మధుసూధనరావు, కళాశాల ప్రిన్సిపాల్ టివి లుకోధర్, కళాశాల ఫిజికల్ డైరక్టర్ కె.వెంకటేశ్వర్లు అభినందించి సత్కరించడం జరిగింది.

## మల్లిఖార్జున్‌రెడ్డిని పరామర్శించిన అనురాధ



నెల్లూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త-వైద్యం గత కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రి పాలై తిరిగి కోలుకుంటూ విశ్రాంతి తీసుకుంటున్న తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త, నారా లోకేష్ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కంచి మల్లిఖార్జునరెడ్డిని గురువారం బాలాజీ నగర్‌లో ఉన్న ఆయన నివాసంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకురాలు, మాజీ మున్సిపల్ చైర్మన్ తాళ్లపాక అనురాధ, మహిళా జిల్లా ప్రధాన కార్యదర్శి విజయమ్మ, సీనియర్ మహిళా నాయకురాలు సుశీలమ్మ, వేణుగోపాల్‌లు కలిసి పరామర్శించారు. మల్లిఖార్జున్‌ని ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ కార్యకర్తలకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఆయనకు భరోసా కల్పించారు. ఎలాంటి సమస్య ఏర్పడిన తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే నారాయణ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు.

## మా సమస్యలను పరిష్కరించండి



**నెల్లూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త-వైద్యం** గిరిజన గురుకులాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించమని తెలుగుదేశం పార్టీ సర్వేపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నెల్లూరు రూరల్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలకి ఉపాధ్యాయులు వినతిపత్రాలను అందజేశారు. గురువారం నగరంలోని వేదాయపాలెం లో ఉన్న చంద్రమోహన్‌రెడ్డికార్యాలయంలో సోమిరెడ్డికి, అదే విధంగా నగరంలోని కేవారి పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న కోటంరెడ్డి శ్రీదర్‌రెడ్డి కార్యాలయంలో శ్రీధర్‌రెడ్డిలకి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ గిరిజన గురుకులాల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ టీచర్లు చేస్తున్న సమ్మెలో వినతిపత్రాలు ఎమ్మెల్యేలకు అందజేశామన్నారు. తమ సమస్యలు వారికి చెప్పుకున్నామని, అందుకు ఎమ్మెల్యేలు సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి తగు సహాయం చేస్తామని వారు హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన గురుకుల టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తార, కేవీ రమణలు, యూనియన్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులు గత నెల రోజుల నుండి సమ్మె చేస్తున్నారని అన్నారు. 15 సంవత్సరాలకు పైగా చాలీచాలని జీతాలతో పని చేస్తున్నారని అన్నారు. టీచర్లు చేసిన సర్వీసును పరిగణలోకి తీసుకోకుండా పోస్టులను డీఎస్సీలో భర్తీ చేసినందు వల్ల నష్టపోతామని అన్నారు. గిరిజన గురుకులాల్లోనే ఈ పరిస్థితి ఎదురవుతుందనిఅన్నారు. గత 34 రోజుల నుండి గిరిజన గురుకులాల్లో చదువులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణమే మా సమస్యలు పరిష్కరించి డ్యూటీలకు పంపించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యేలకు యూనియన్ తరుపున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కే.శ్రీనివాసులు, కృష్ణ, రాజ్యలక్ష్మీ, కళ్యాణ్, కృష్ణ, సునీల్, సుభాహాని తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యశ్రీ సేవలపై తనిఖీలు



నెల్లూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త-వైద్యం నగరంలోని రెయిన్బో, రీచ్ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా అందుతున్న సేవలను గురువారం డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా (ఆరోగ్యశ్రీ) జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్వీ సుధీర్ కుమార్ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఆసుపత్రిలో చిన్న పిల్లల వార్డు, ఆర్థోపెడిక్ వార్డు, ఫిజియోథెరిపి విభాగాల్లో అందుతున్న వైద్య సేవలు గురించి రోగులను ప్రశ్నించి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధీర్ కుమార్ మాట్లాడుతూ రోగులు ఆసుపత్రులకు వచ్చినప్పుడు యాజమాన్యాలు సకాలంలో అడ్మిషన్ చేర్చుకుని నాణ్యమైన వైద్య సేవలందించాలని సూచించారు. కొన్ని రకాల ఆపరేషన్లకు గిట్టుబాటు కావడం లేదంటూ ఎవరైనా అదనంగా డబ్బులు వసూళ్లు చేసినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వైద్య సేవ సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. లోపాలు ఏమైనా ఉంటే వైద్య సేవా మిత్రలు తక్షణమే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్య సేవా జిల్లామేనేజర్ వెంకట మురళి, టీమ్ లీడర్లు తదితరులు పాల్గొన్నారు.

## డివైడర్లపై ఫ్లెక్సిలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవు

## కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డి



**బుచ్చి డిసెంబర్ 19 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగర పాలక పంచాయి తీలోని ముంబాయి జాతీయ రహదారిపైన ఉన్న డివైడర్‌పైన ఫ్లెక్సి లు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరిం చారు. వ్యాపార స్తులు, రాజకీయ పార్టీ నాయకులు సహకరించాలని ఆయన కోరారు. డివైడ ర్‌పైన స్తంభాలకు ఫ్లెక్స్ బోర్డులు వేసినందువల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవ కాశం ఉందని అన్నారు. అందరు క్షేమంగా ఉండాలన్న మంచి ఆలోచనతో అంద రు సహకరించాలని కమీషనర్ విజ్ఞప్తి చేశారు.

## శ్రీగోపాలకృష్ణయ్య స్కూల్‌లో మాడ్స్‌ల్యాబ్ ప్రదర్శన





బుచ్చి డిసెంబర్ 19 ప్రభాతవార్త బుచ్చిరెడ్డిపాళెం శ్రీగోపాలకృష్ణయ్య స్కూల్‌లో జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా మ్యాడ్స్ ల్యాబ్ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈల్యాబ్‌ని విశ్వం ఎడ్యుకేషనల్ సొల్యూషన్స్ జోనల్ మేనేజర్ డి.వెంకటేశ్వర్లు ప్రారంభం చేశారు. ఈప్రదర్శనలో దాదాపుగా 500 మాడ్యకు సంబందించినటువంటి ప్రయోగాలున్నాయి. అలాగే విద్యార్థులు కూడా కొన్ని తయారు చేసుకొని ఈరోజు ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ నేలనూతల శ్రీదర్ మాట్లాడుతు విద్యార్థులకి మ్యాడ్స్ పట్ల భయాన్ని పోగొట్టి వారు లెక్కలతో ఆటలాడాలి అని అన్నారు. లెక్కల్ని అభిమానించాలి దానికి ఈ ల్యాబ్ చాలా చక్కగా ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఈప్రదర్శన రెండు రోజులుపాటు ఉంటుందని తల్లిదండ్రులు పుర ప్రముఖులు విచ్చేసి ల్యాబ్ సందర్శించ వలసిందిగా ఆయన పిలుపునిచ్చారు. పాఠశాల ప్రిన్సిఫల్ సురేఖ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## దేవాదాయశాఖ మంత్రిని కలిసిన నీటి సంఘం అద్యక్షులు సూరా



**సంగం డిసెంబర్ 19 ప్రభాతవార్త** దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని సంగం మండలం అన్నారెడ్డిపాళెం నీటి సంఘం అధ్యక్షులు సూరా శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యాక్షులు పూసాల శ్రీదర్ కలిసి పుష్పగుచ్చం అందజేశారు. సాగునీటి సంఘాలన్ని ఏకగ్రీవం కావడం పట్ల మంత్రి అందరిన్న అభినందించారు.

## పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

## చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా



**బుచ్చి డిసెంబర్ 19 ప్రభాతవార్త** ప్రస్తుతం వర్షాకాలం, దోమలు ఎక్కువగా ఉంటాయి వాటిని నియంత్రించేందుకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మున్సిపల్ సిబ్బందికి సూచించారు. పారిశుద్ధ్య కార్మికులు పట్టణాన్ని పూర్తి స్థాయిలో శుభ్రంగా ఉంచేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని సూచించారు. ప్రజలు కూడా చెత్తను ఎక్కడబడితే అక్కడ పడ వేయకుండా మున్సిఫల్ వాహనాలకు అందించాలని ఆమె సూచించారు. వర్షాకాలం నగరంలో చెట్లు కూడా నాటాలని ఆమె సిబ్బందికి సూచించారు.

## మంత్రి నారాయణను కలిసిన జనసేన సుధాకర్



**కావలి, డిసెంబర్19 ప్రభాతవార్త** పురపాలకశాఖామాత్యులు పొంగూరు నారాయణను జనసేనపార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్ మర్యాద పూర్వకంగా కలిశారు. నెల్లూరులోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో సుధాకర్ కలిసి దుశ్శాలువాతో సత్కరించి పూలబొకే అందచేశారు. అనంతరం మంత్రి నారాయణతో కొద్దిసేపు ముచ్చటించారు.

## క్రిస్మస్ వేడుకలకు ఎమ్మెల్సీ పర్వత రెడ్డికి ఆహ్వానం



**నెల్లూరు రూరల్, డిసెంబర్ 19, ప్రభాతవార్త** 50, 51 వ డివిజన్‌లో క్రిస్మస్ వేడుకలకు హాజరు కావలసినదిగా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని ఆహ్వానించిన డివిజన్ స్థానిక యువత నెల్లూరు రాంజీ నగర్ లోని కార్యాలయంలో వైసిపి నాయకులు చీదెళ్ల కిషన్ ఆధ్వర్యంలో 50, 51 డివిజన్ లకు చెందిన స్థానిక యువత వైఎస్ఆర్సిపి నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని కలిసి డివిజన్‌లో జరిగే క్రిస్మస్ వేడుకలకు విచ్చేయాల్సిందిగా ఆహ్వానం అందజేశారు. క్రిస్మస్ వేడుకలకు తప్పకుండా హాజరవుతానని తెలియజశారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి యువత తో మాట్లాడిడివిజన్‌లోని స్థానిక అంశాలను గురించి అడిగి తెలుసుకున్నారు.

## ఉమ్మడి నెల్లూరు జిల్లా మహిళల హ్యాండ్ బాల్ జట్టు ఎంపిక



**కోవూరు, డిసెంబరు 19ప్రభాతవార్త** : కోవూరు మండలంలోని పాటూరు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో హ్యాండ్‌బాల్ మహిళల జిల్లా జట్టు ఎంపికలు నెల్లూరు జిల్లా అడహక్ కమిటీ చైర్మన్ ఎన్. విక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఎంపికల్లో జిల్లా నలుమూలల నుంచి 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రస్తుతం ఇక్కడ ఎంపికైన హ్యాండ్‌బాల్ మహిళల జట్టు ఈ నెల 21, 22 తేదీల్లో బుచ్చిరెడ్డిపాలెంలోని రెయిన్‌బో ఇంగ్లీష్ మీడియం క్రీడా మైదానంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు భీమతాటి వెంకటరమణయ్య, మధుసూదన్‌రావు, ప్రవీణ కుమారి, శ్యామ్, ప్రదీప్, రెయిన్‌బో స్కూల్ కరస్పాండెంట్ చిట్టిబాబు, అజయ్, తదితరులు ఉన్నారు.

## గ్లోబల్ స్టార్ రామ్ చరణ్‌ను కలిసిన సుజయ్‌బాబు



**నెల్లూరు,డిసెంబరు19 ప్రభాతవార్త-విద్య** గ్లోబల్‌స్టార్ రామ్‌చరణ్‌ను గురువారం హైదరాబాద్‌లోని చిరంజీవి ఐ బ్యాంక్‌లో జనసేన పార్టీ నగర అధ్యక్షులు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు మర్యాధపూర్వకంగా కలసుకున్నారు. ఈ సందర్భంగా సుజయ్‌బాబు రామ్‌చరణ్‌ను శాలువాకప్పి, అరుదైన పుష్పాలతో అలంకరించిన పుష్పగుచ్చాలను అందించి ఘనంగా సత్కరించారు. అనంతరం సుజయ్‌బాబు మాట్లాడుతు తనకు జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన చరణ్‌కు ధన్యవాదాలు తెలిపారు. అలాగే మోగా డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా తెరకెక్కించిన చిత్రం గేమ్ ఛేంజర్ 2025 సంక్రాంతికి విడుదల కానున్న నేపథ్యంలో ఈ చిత్రం రికార్డులను తిరగరాయాలని ఆకాంక్షించారు. అభిమాన సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## సంగం పోలీస్ స్టేషన్ తనీఖి చేసిన ఆత్మకూరు డిఎస్‌పి



**సంగం డిసెంబర్ 19 ప్రభాతవార్త** సంగం పోలీస్‌స్టేషన్‌ను ఆత్మకూరు డిఎస్‌పి వేణుగోపాల్ తనీఖి చేశారు. స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు కూడా బాగస్వాములు కావాలని ఆయన కోరారు. రోడ్డు ప్రమాదాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించడం,కార్లులలో వెళ్ళే వారు సీటు బెల్ట్ దరించాలని ఆయన చెప్పారు. మద్యం త్రాగి వాహనాలు డ్రైవ్ చేయడం చాలా ప్రమాదకరం అని హెచ్చరించారు.ప్రజలు ఆన్‌లైన్ ఆకర్షణల విషయంలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు.క్రిస్మస్,పండుగ సెలవలకు వెళ్ళే సమయంలో ప్రజలు విలువైన వస్తువులు ఇండ్లలో ఉంచుకోరాదని అందుకు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు . మాద్యద్రవ్యాలు అరికట్టే విషయంలో ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. సంగం సిఐ వేమారెడ్డి,సిఐ రాజేష్ పనితీరు బాగుందని ఆయన ప్రశంసించారు .ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్ శాఖకు సమగ్ర సమాచారం అందించండి : అదనపుకమిషనర్ నందన్



**నెల్లూరు కార్పొరేషన్,డిసెంబర్ 19,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి స్టాంపులు రిజిస్ట్రేషన్ ల శాఖ ఐ.జి.ఆ ర్.ఎస్. వెబ్సైటులో నమోదు చేసేందుకు అవసరమైన సమగ్ర వివరాలను ఆ శాఖకు అందించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ నందన్ రెవెన్యూ విభాగం అధికారులను ఆదేశించారు. కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో గురువారం స్టాంపులు , రిజిస్ట్రేషన్ శాఖ నగర పాలక సంస్థ రెవెన్యూ విభాగం సిబ్బంది తో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ ఇంటి నెంబర్లు, ఏరియాలు డివిజన్ల వారీగా ప్రణాళికాబద్ధంగా వెబ్సైట్లో అప్లోడ్ చేసేందుకు అవసరమైన పూర్తి వివరాలను అందించాలని సూచించారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు జిల్లా రిజిస్టర్ హరి వర్మ సబ్ రిజిస్టర్ సింహాద్రి నాయుడు రెవెన్యూ అధికారి ఇనాయతుల్ల, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, పరిపాలనా కార్యదర్శులు పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్ లను ప్రతిరోజు పర్యవేక్షించండి : అదనపు కమిషనర్ నందన్



**నెల్లూరు కార్పొరేషన్,డిసెంబర్ 19,ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్లను సచివాలయ మహిళా ప్రొటెక్షన్, ఆమెనిటీస్ కార్యదర్శులు ప్రతిరోజు పర్యవేక్షించాలని అదనపు కమిషనర్ నందన్ ఆదేశించారు. హరనాథపురం కూడలిలోని అన్న క్యాంటీన్ ను అదనపు కమిషనర్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లో క్యాంటీన్ ప్రజలకు అందుతున్న భోజన నాణ్యత, తాగునీరు, వంటశాల నిర్వహణ తదితర అంశాలను అదనపు కమిషనర్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయ కార్యదర్శులు ప్రతిరోజు తనిఖీ చేసి నాణ్యత, మోతాదు తదితర అంశాలను క్రమం తప్పకుండా, క్రుణంగా పరిశీలించి నివేదికలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు అందజేయాలని ఆదేశించారు.

## సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై శిక్షణ

ఉలవపాడు, డిసెంబర్ 19, ప్రభాతవార్త సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ అంశంపై గురువారం మండలంలోని వివిధ మండల స్థాయి అధికారులకు, గ్రామ సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులు(గ్రేడ్-1, 4) సచివాలయ సిబ్బందికి శిక్షణా తరగతులను ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం రాష్ట్రీయ గ్రామ్ స్వరాజ్ అభియాన్ నిధులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ ఆవశ్యకత, పంచాయతీ అభివృద్ధి సూచిక, లోకల్ ఇండికేటర్ ప్రేమ్ వర్క్, జీపీడీపీ ఆక్టివిటీస్ గురించి 9 థీమ్స్, పేదరికం లేని మెరుగైన జీవనోపాధులు కలిగిన ఆరోగ్యవంతమైన, బాలహిత, సమృద్ధిగా నీరు కలిగిన, పచ్చదనం పరిశుభ్రత, తదితర అంశాలపై ఆమె శిక్షణ ఇచ్చారు. అనంతరం ఈవోపీఆర్డీ శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలను సక్రమంగా రూపొందించుకుని అమలు చేయడం ద్వారా సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించడం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఎనర్జీ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, వీపీఏలు పాల్గొన్నారు.

## పొగాకులో ఉత్తమ యాజమాన్య పద్ధతులు చేపట్టి నాణ్యమైన పొగాకు పండించాలి

### - దక్షిణ ప్రాంత నేలల రీజనల్ మేనేజర్ డాక్టర్ వంశీకృష్ణ




**కందుకూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త** పొగాకులో ఉత్తమ యాజమాన్య పద్ధతులు చేపట్టి నాణ్యమైన పొగాకు పండించాలని పొగాకు బోర్డు ప్రొడక్షన్ మరియు రీజనల్ మేనేజర్ కృష్ణ అన్నారు. కందుకూరు జాతీయ పొగాకు పరిశోధన సంస్థ నందు గురువారం పొగాకు బోర్డు వారి ఆధ్వర్యంలో పొగాకులో చేపట్టాల్సిన ఉత్తమ యాజమాన్య పద్ధతులపై దక్షిణ ప్రాంత తేలిక నేలలు, నల్ల రేగడి నేలల పొగాకు రైతులకు, సిబ్బందికి శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పొగాకు బోర్డు గుంటూరు నుంచి మేనేజర్ ప్రొడక్షన్, రీజనల్ మేనేజర్ కృష్ణశ్రీ, మేనేజర్ ఎక్స్‌టెన్సన్ దామోదర్, మేనేజర్ మార్కెటింగ్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ శ్రీ శ్యాంప్రసాద్, సీటీఆర్ఐ కందుకూరు హెడ్ అనురాధ, ఇతర శాస్త్రవేత్తలు, ఇతర కంపెనీ ప్రతినిధులు బోర్డు సిబ్బంది, రైతు సోదరులు పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ రైతులు పొగాకులో ఉత్తమ యాజమాన్య పద్ధతులు చేపట్టి నాణ్యమైన పొగాకు పండించాలని తెలిపారు. దీని కోసం పొగాకు పంటకు ముందు పచ్చి రొట్ట పైరు సాగు చేయాలని కోరారు. నాట్లు వేసేటప్పుడు నాణ్యమైన నారును మరి ముఖ్యంగా ట్రే విధానం ద్వారా సాగు చేసిన నారును వాడాలి. దీని వలన పంట అంతా ఒకే సారి పంటకు వస్తుందని తెలిపారు. పొగాకు ప్రధాన పొలంలో ఎరువులను సమతుల్యంగా వాడాలని, మరీ ముఖ్యంగా పొటాష్ ఎరువు వాడాలని కోరారు. దీని వలన పొగాకులో నాణ్యత వస్తుందని అన్నారు. పొగాకులో విచ్చలవిడిగా పురుగు మందులు వాడకూడదని అవసరమైన అప్పుడే సిఫార్సు చేసిన మందులు వాడాలని కోరారు. సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టి పురుగుల, తెగుళ్ళ నివారణ చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో శాస్త్ర వేత్తలు రైతు సోదరులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. అంతే కాకుండా పొగాకు సాగుతో పాటు సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. తద్వారా దామోదర్ మాట్లాడుతూ నూతన టెక్నాలజీ లో భాగంగా ఆకు అల్లే పరికరాన్ని రైతు సోదరులు కోసం ప్రదర్శించారు. తర్వాత డ్రోన్ విధానంలో పురుగు మందుల పిచికారిని కూడా ప్రదర్శించారు. దీని ద్వారా కార్మికుల మీద ఆధారపడటం తగ్గుతుందని తెలిపారు. అలానే పక్వానికి వచ్చిన ఆకులనే రెలచాలని, పొగాకు బ్యారన్‌లో పరిదికి మించి అల్లిన కర్రలను పెట్టకూడదని, కురోమీటర్, ఖచ్చితంగా వాడాలని దీని వలన అగ్ని ప్రమాదాలు నివారించవచ్చని తెలిపారు. గ్రేడ్ చేసే సమయం లో అన్య పదార్థాలు తీసి వేయాలని అన్నారు. పొగాకు బేళ్ళు కట్టేటప్పుడు తేమ లేకుండా చూడాలని కోరారు. 11 వేలం కేంద్రాల పొగాకు రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో సమస్యల పరిష్కారం కోసం పలువురు మంత్రులను కలిసిన మాజీ ఎమ్మెల్యే

**కందుకూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త** కందుకూరు నియోజకవర్గ సమస్యల పరిష్కారం కోసం కందుకూరు నియోజకవర్గం అభివృద్ధి మండలి కమిటీ చైర్మన్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దివి శివరాం గురువారం రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడు, పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి నారాయణను దేవాదాయ శాఖ మంత్రి రామ్ నారాయణరెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రాలను కలుసుకుని కలుసుకుని నియోజకవర్గంలోని పలు సమస్యలు ప్రధానంగా తహశీల్దార్ కార్యాలయంలో పెట్రోల్ బంకు ఏర్పాటు వద్దని, రాళ్లపాడు రిజర్వాయర్ మరమ్మత్తులు నిధుల విడుదల, పురపాలక సంఘం అభివృద్ధికి నిధులు వారి దృష్టికి తీసుకెళ్లినట్లు శివరాం చెప్పారు. మంత్రులు సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట మండలి కమిటీ సభ్యులు తోకల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## న్యాయ విజ్ఞాన సదస్సు ప్రధాన న్యాయమూర్తి యామిని



**కొడవలూరు (విడవలూరు), డిసెంబర్ 19, ప్రభాతవార్త** మండలం టపా తోపు ఆవరణం రాజుపాలెం ఆంజనేయ సీ ఫుడ్స్ భవనంలో న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి యామిని ఆధ్వర్యంలోనిర్వహించారు. గురువారం హైకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం నెల్లూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గౌరవనీయులైన డాక్టర్ సి యామిని ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో దుకాణాలు సంస్థలు కర్మాగారాలు మోటర్ రవాణా సంస్థలు సొసైటీలు మరియు ట్రస్టులో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ కార్మిక సంక్షేమ నిధి చట్టం 1987 రూపొందించి అమలు చేస్తుందన్నారు. ఈ చట్టం పరిధిలో ఉన్న ప్రతి సమస్త యజమాని ఆ సమస్త ప్రతి కార్మికుని తరఫున 100 రూపాయలు వార్షిక చందా క్రింద సంక్షేమ నిధికి చెల్లించాలి యజమాని వాట 70 రూపాయలు కార్మికుని వాటా 30 రూపాయలు ఈ విధముగా చెల్లించగా వచ్చిన మొత్తాన్ని కార్మిక సంక్షేమ మండలి అర్హులైన కార్మికులకు వివిధ పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందిస్తుందని తెలియజేశారు. అనంతరంసీనియర్ సివిల్ జడ్జి కే వాణి మాట్లాడుతూ భారతదేశంలో వ్యక్తులు మధ్య వచ్చే తగాదాలు కోర్టు ద్వారా పరిష్కరించుకోవడానికి అధిక కాలం పట్టటమే గాక అధిక శ్రమ ఖర్చులతో కూడిన పని సాధారణ ప్రజలు ఈ ఖర్చును భరించలేరు. అయితే 39 (అ) రాజ్యాంగ అధికరణ ప్రకారం ప్రభుత్వం ఒక చట్టం ద్వారా నిర్దిష్టమైన ప్రణాళికతో ప్రజలకు ముఖ్యముగా ఆర్థికంగా సామాజికంగానూ వెనుకబడిన వర్గాలకు నిరక్షరాశులకు, అంగవైకల్యం ఉన్న వ్యక్తులకు ఉచిత న్యాయసహాయం అందజేయాలి ఈ దిశలో ప్రభుత్వం 1987 సంవత్సరంలో న్యాయ సేవాధికార సంస్థల చట్టాన్ని రూపొందించి దేశవ్యాప్తంగా అధికార సంస్థల నిరపరిచి ప్రతిష్టమైన ఉచిత సేవలు సమాజంలోని వెనుకబడిన వర్గాలకు మహిళలకు అందించాలని తెలిపారు.అలాగే మీకు ఏమి అవసరం అయినా మా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థను సంప్రదించవచ్చుని తెలిపారు. అలాగే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ టోల్ ఫ్రీ నెంబర్ 15100 కి ఫోన్ సంప్రదించవచ్చు అన్నారు. అసిస్టెంట్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎస్కె గౌస్ భాషా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కార్మిక సంక్షేమ మండలి సంక్షేమ పథకాలు గురించి విసిదీకరించినారు. అలాగే మీకు ఈ సంక్షేమ పథకాల గురించి ఏమీ అవసరమైన మా లేబర్ డిపార్ట్మెంట్ ను సంప్రదింపులు చేయవచ్చు అన్నారు. వివాహ కానుక విద్యా ప్రోత్సాహకం వికలాంగులైన కార్మికుల పిల్లలకు విద్య ప్రోత్సాహం వైద్య, ప్రమాదమరణ ఆర్థిక, సహజమరణ ఆర్థిక, అంగవైకల్యానికి ఆర్థిక సహాయం ఇలా ప్రతిదాని గురించి విసిదీకరించినారు. అలాగే ఈ కార్యక్రమంలో ప్యారా లీగల్ వాలంటరీ వెంకటేశ్ ఆంజనేయ సి ఫుడ్స్ ఏవి ప్రసాద్, ఏ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

